



VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 54 | శుక్రవారం 24 జూలై 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్...
## సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం



- అమరావతిలో క్వాంటం ఫైనాన్స్ హబ్ ఏర్పాటు చేయనున్న పీఎన్‌బీ
- రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య కీలక ఒప్పందం
- దేశంలోనే ఇలాంటి హబ్ ఏర్పాటు చేస్తున్న తొలి బ్యాంకుగా పీఎన్‌బీ
- బ్యాంకింగ్ సైబర్ భద్రత, మోసాల నివారణే ప్రధాన లక్ష్యం
- డిజిటల్ అక్షరాస్యత పెంచాలని సీఎం చంద్రబాబు సూచన

# ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు

- ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్
- తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరిక
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ డిమాండ్ చేయడం లేదని విమర్శ

జూలై 23 వార్త సాక్ష్యం

తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ వస్తున్న ఆరోపణల పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో చిట్‌చాట్ గా మాట్లాడిన ఆయన, తనపై వస్తున్న ఆరోపణలపై దమ్ముంటే ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.


2

## ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..
# పేపర్ లీకేజీల పై ఉక్కుపాదం

- ఫాస్ట్-ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు
- కొత్త యాంటీ-చీటింగ్ చట్టం కింద పేపర్ లీకేజీ కేసుల విచారణ
- దోషులుగా తేలితే 5 ఏళ్ల జైలు, రూ.10 లక్షల వరకు జరిమానా


2

# బ్రిడ్జ్‌లు కూలుస్తాం.. ట్రంప్ బెదిరింపులకు ఇరాన్ కౌంటర్!

జూలై 23 వార్త సాక్ష్యం

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా తీవ్ర స్థాయికి చేరాయి. హోర్ముజ్ జలసంధి కేంద్రంగా ఇరాన్, అమెరికా దేశాల మధ్య మాటల యుద్ధం కాస్తా.. ప్రతీకార దాడుల హెచ్చరికలకు దారితీసింది. ఇరాన్ మౌలిక సదుపాయాల పై దాడి చేస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు ఇరాన్ అంతే ఘాటుగా స్పందించింది.


2

# కంపెనీలు ఏపీని ఎంచుకోవడానికి కారణం ఇదే: మంత్రుల బృందం తొలి సమావేశంలో లోకేశ్

- నారా లోకేశ్ అధ్యక్షతన మంత్రుల బృందం తొలి సమావేశం
- పరిశ్రమల రాకకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే కారణం అని లోకేశ్ వెల్లడి
- రాష్ట్రానికి రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు
- దీని ద్వారా 24.66 లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశం
- ఎంఎస్ఎంఇ ఓల పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రుల బృందం నిర్ణయం



## సమాజ సేవలో- ఆత్మకూరు రిజిస్ట్రేషన్ శాఖ అధికారి అబ్దుల్ కరీం భాష

-అనారోగ్యంతో బాధపడుతున్న డ్రైవర్ వల్లి కుటుంబానికి ఆర్థిక సహాయం
-మానవత్వం చాటుకున్న ఆత్మకూరు సబ్ రిజిస్టర్ అధికారి
-స్నేహితుడు కుద్దూస్ అందించిన సమాచారంతో మానవతా దృక్పథంతో పేద కుటుంబానికి నగదు భరోసా

ఆత్మకూరు జులై 23 వార్త సాక్ష్యం



అనారోగ్యంతో బాధపడుతూ పేదరికంలో నలుగుతున్న కుటుంబానికి నేను ఉన్నాను అంటూ భరోసా కల్పిస్తూ సమాజ సేవ కోసం పాటుపడే అధికారులు కొందరే ఉంటారని మరోసారి నిరూపించుకున్నారు ఆత్మకూరు పట్టణంలోని ఏకలవ్య నగర్ కాలనీలో నివాసం ఉంటున్న వలి అనే డ్రైవర్ కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతూ ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు ఆత్మకూరు సబ్ రిజిస్ట్రేషన్ అధికారి అబ్దుల్ కరీం భాష గురువారం మానవత దృక్పథంతో తమకు తోచినంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రేషన్ అధికారి అబ్దుల్ కరీం భాష మాట్లాడుతూ నా స్నేహితుడు కుద్దూస్ అందించిన సమాచారంతో వెంటనే వలి ఇంటి దగ్గరికి చేరుకొని అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శించి తక్షణమే ఆర్థిక సహాయం అందించడం జరిగిందని అన్నారు ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం ఆ దేవుడిచ్చిన వరం అని కొనియాడారు మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరూ పేదవారికి సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# రూ. లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను కాపాడుతున్న సీఎం రేవంత్: నిజామాబాద్ ఎంపీ



జూలై 23 వార్త సాక్ష్యం

తెలంగాణలో సాగు, తాగు, థర్మల్ పవర్ ప్లాంట్లకు నీరు అందడం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సంపద లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేద్దామనుకుంటున్నారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసినవారు, ప్రస్తుతం కాపాడే వ్యక్తి బాగానే ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. - మిగతా2లో

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 24 జూలై 2026

## ప్రధాని మోదీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ..

## పేపర్ లీకేజీల పై ఉక్కుపాదం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్-ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్-2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్-ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## బ్రిడ్జ్‌లు కూలుస్తాం.. ట్రంప్ బెదిరింపులకు

## ఇరాన్ కౌంటర్!

డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక: కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేసిన ప్రతీసారి, ఇరాన్‌కు చెందిన ఒక వారధిని లేదా విద్యుత్ ప్లాంట్‌ను బాంబులతో ధ్వంసం చేస్తామని డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఇరాన్ ప్రతిస్పందన: ట్రంప్ వ్యాఖ్యల పై ఇరాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'అమెరికా గనుక మా దేశంలోని ఏ ఒక్క బ్రిడ్జిని లేదా పవర్ ప్లాంట్‌ను లక్ష్యంగా చేసుకున్నా... మేము ఈ ప్రాంతంలోని మౌలిక సదుపాయాలతో పాటు అమెరికాకు ప్రయోజనం కల్పించే చమురు కేంద్రాలను సమూలంగా ధ్వంసం చేస్తాం' అని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ దీనిపై స్పందిస్తూ... తమ దేశం 'కంటికి కన్ను' విధానాన్ని పాటిస్తుందని, తమ దేశ మౌలిక సదుపాయాలపై జరిగే ఏ దాడికైనా అంతే తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు.

**గగనతల దాడులు - పెరిగిన మృతుల సంఖ్య**

ఒకవైపు హెచ్చరికలు కొనసాగుతుండగానే, మరోవైపు సైనిక చర్యలు తీవ్రమవుతున్నాయి. వాణిజ్య నౌకలపై ఇరాన్ బెదిరింపులను అణచివేసే లక్ష్యంతో అమెరికా మిలిటరీ వరుసగా 12వ రోజు కూడా ఇరాన్‌లోని పలు ప్రాంతాల పై వైమానిక దాడులు నిర్వహించింది. పశ్చిమ ఇరాన్‌లోని అహ్వాజ్, రామ్‌షీర్, అండిమేష్క్ సమీపంలో అమెరికా క్షిపణి దాడులు జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. షాలంచె సరిహద్దు వద్ద జరిగిన క్షిపణి దాడిలో మృతుల సంఖ్య 3కి పెరిగినట్లు ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. ఖుజెస్తాన్ అధికారులు ప్రస్తుతం ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు అందిస్తున్నారు.

**హోర్ముజ్ జలసంధిలో నిలిచిపోయిన చమురు నౌకలు**

ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై తమకే పూర్తి సార్వభౌమాధికారం ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్ 'రివల్యూషనరీ గార్డ్స్' తెలిపిన వివరాల ప్రకారం... ఈ జలసంధి గుండా వెళ్లేందుకు యత్నించిన మూడు చమురు ట్యాంకర్లను అడ్డుకున్నారు. ఇందులో ఒక నౌక పేలిపోయి అగ్నిప్రమాదానికి గురికాగా, మిగిలిన రెండు నౌకలు వెనక్కి మళ్లినట్లు ఇరాన్ ప్రకటించింది.

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు..

## 48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు.రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద నీట్ అక్రమాలపై, విద్యా వ్యవస్థలో మార్పుల కోసం డిమాండ్ చేస్తున్న విద్యార్థులపై పోలీసులు టియర్ గ్యాస్, లాఠీఛార్జ్‌తో విరుచుకుపడటం తీవ్ర సంచలనం సృష్టించింది.విద్యార్థులు కూడా పలువురు పోలీసులపై దాడి చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న ఈ పోరాటానికి మద్దతుగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపట్టనున్న భారీ నిరసన కార్యక్రమంలో కేటీఆర్ స్వయంగా పాల్గొననున్నారు.

# ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదు

ఒకవేళ అది తప్పుడు ఫిర్యాదు అని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ఓటు బదిలీ కోసం నిబంధనల ప్రకారం ఇప్పటికే కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను తొలగించారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఓటర్ల జాబితా సవరణ పూర్తయిందని, ప్రక్షాళన నెపంతో ఓట్లు గల్లంతు కాకుండా ఉండేందుకు బీఎల్ఓలను నియమించినట్లు వివరించారు. ఓట్లు లేకపోతే ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతాయని ఆయన ప్రశ్నించారు. హైడ్రా పనితీరుపై ముఖ్యమంత్రి ప్రశంసలు కురిపించారు. ఈ సంస్థ ఇప్పటికే అనేక అక్రమ ఆస్తులను స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతి కారణంగానే కేసీఆర్ గతంలో హరీశ్ రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటర్‌మీడియట్ ఫలితాల వెల్లడిలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబరీనా సంస్థ వ్యవహారంలో కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మరణాలకు కారణమైన కేటీఆర్, ఇప్పటికైనా బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ఆయన నిలదీశారు.

# అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్... సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక టెక్నాలజీలకు కేంద్రంగా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ)లో "క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్" ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మధ్య ఒక ముఖ్యమైన ఒప్పందం కుదిరింది. గురువారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఏపీ క్వాంటం మిషన్, పీఎన్‌బీ ఈ అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా ఒక క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన మొట్టమొదటి బ్యాంకుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలవడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో పీఎన్‌బీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ చంద్ర, ఏపీ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు కానున్న ఈ హబ్, బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది. ముఖ్యంగా బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను గణనీయంగా పటిష్ఠం చేయడం, ఆర్థిక మోసాలను ముందుగానే పసిగట్టే వ్యవస్థలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలను సురక్షితంగా తీర్చిదిద్దడం వంటి అంశాల పై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. కేవలం బ్యాంకింగ్ రంగానికే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సమిష్టి ఆవిష్కరణలకు ఊతమివ్వనుంది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన టెక్నాలజీలలో పరిశోధనలను ప్రోత్సహించడం, అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడం కూడా ఈ హబ్ కార్యకలాపాల్లో భాగం కానుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, క్వాంటం, డీప్ టెక్నాలజీలకు ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ హబ్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం ఆ దిశగా వేస్తున్న మరో కీలకమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు. డిజిటల్ లావాదేవీలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, వినియోగ దారులకు, సాధారణ ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, బ్యాంకులపై ఉందని పీఎన్‌బీ ఉన్నతాధి కారులకు సూచించారు. "డిజిటల్ అరెస్ట్" వంటి ఆధునిక సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే టెక్నాలజీ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు అత్యుత్తమ భద్రతను అందించాలని స్పష్టం చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర మాట్లాడుతూ, డిజిటల్ బ్యాంకింగ్‌ను మరింత పటిష్ఠంగా, సురక్షితంగా, సులభతరంగా మార్చేందుకే అమరావతిలో ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కేంద్రం ద్వారా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎన్‌బీకి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

# కంపెనీలు ఏపీని ఎంచుకోవడానికి కారణం ఇదే: మంత్రుల బృందం తొలి సమావేశంలో లోకేశ్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో భారీగా పెట్టుబడులు రానున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రూ.29.30 లక్షల కోట్ల పెట్టుబడులతో 1037 పరిశ్రమలు రాష్ట్రంలో ఏర్పాటయ్యేందుకు ముందుకు వచ్చాయని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 24.66 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటైన మంత్రుల బృందం తొలి సమావేశం ఉండవల్లిలో మంత్రి లోకేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ప్రతి ప్రాజెక్టును నిరంతరం ట్రాక్ చేస్తూ, అవి త్వరితగతిన కార్యరూపం దాల్చేలా (గ్రౌండింగ్) చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. "పారిశ్రామిక సంస్థలు ఏపీని ఎంచుకోవడానికి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ప్రధాన కారణం. దీనిని ప్రతి అధికారి చిత్తశుద్ధితో అమలు చేయాలి" అని ఆయన స్పష్టం చేశారు. పరిశ్రమలకు భూ కేటాయింపులు, అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రతినెలా నిర్వహించే సమీక్షా సమావేశంలో కచ్చితమైన పురోగతి కనిపించాలని దిశానిర్దేశం చేశారు. నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ ద్వారా మరిన్ని పరిశ్రమలు రాష్ట్రానికి తరలివచ్చే అవకాశం ఉందని లోకేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చే పరిశ్రమలకు పునరుత్పాదక ఇంధన అవసరాలు ఎక్కువగా ఉంటాయని, అందువల్ల రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇవి ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని మంత్రి అన్నారు. నిర్ణీత సమయంలో పరిశ్రమలను ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించేందుకు పూర్తిస్థాయి ఆటోమేటిక్ వ్యవస్థను తీసుకురావాలని ఆదేశించారు. గత రెండేళ్లలో 1,20,897 ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందించినట్లు అధికారులు ఈ సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగూరి నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను కాపాడుతున్న సీఎం రేవంత్: నిజామాబాద్ ఎంపీ

గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సంపద లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేద్దామనుకుంటున్నారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసినవారు, ప్రస్తుతం కాపాడే వ్యక్తి బాగానే ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కానీ మధ్యలో రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. 2023లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని వివరించారు. 2019లోనే మూడు బ్యారేజీల వద్ద పనులు ప్రారంభించిన వెంటనే పగుళ్లు వచ్చాయని పేర్కొందని తెలిపారు. 2023, అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్లు ఇసుక కారణంగా కుంగిపోయాయని ఎన్డీఎస్ఏ వివరించిందని అన్నారు. డీపీఆర్ అనుమతులు లేకుండానే కాళేశ్వరం నిర్మించారని విమర్శించారు. ఈ బ్యారేజీలను ముందస్తు ప్రణాళిక ప్రకారం కాకుండా వేరే చోట నిర్మించారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు కమీషన్లు ఇవ్వాలనే ఆతృతతో ఆగం ఆగంగా నిర్మించారని తెలిపారు. డిజైన్లు ఎందుకు మార్చారు.. అందుకు సంబంధించిన ఫైళ్లు అడిగితే జవాబు ఇవ్వలేదని బీజేపీ ఎంపీ మండిపడ్డారు. అన్నారం, సుందిళ్ల కూడా మేడిగడ్డ మాదిరిగానే ఉన్నాయని అన్నారు. మూడు బ్యారేజీలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన చోట తిరిగి రిపేర్లు చేయాలని ఎన్డీఎస్ఏ సూచించిందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఈ 30 నెలలు సీఎం రేవంత్ రెడ్డి ఏం చేశారని ఎంపీ ధర్మపురి అర్వింద్ సందేహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం సీబీఐ విచారణకు ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. రూ.30 వేల కోట్ల విలువైన పనులు జరిగిన తర్వాత ఎన్డీఎస్ఏ దగ్గరకు వచ్చారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. లక్ష కోట్లు నీళ్లలో పోయాయని కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. రూ. లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్, కేటీఆర్ దోచుకున్న పైసలను ప్రస్తుతం వారి నుంచి సీఎం రేవంత్ దోచుకుంటున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఎంత తీసుకున్నాడు.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంత ఇచ్చాడు అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు.

# అంతరిక్షంలో 3 భారతీయ వంటకాలకే చోటు..

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని (ఐఎస్ఎస్)కి వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా.. తనతో మూడు భారతీయ వంటకాలు మాత్రమే తీసుకెళ్లినట్లు ఇటీవల వెల్లడించారు. గగన్‌యాన్ మిషన్ కోసం అంతరిక్ష ఆహారాన్ని అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవోకు చెందిన డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (డీఎఫ్ఆర్ఎల్) అనేక భారతీయ వంటకాలను సిద్ధం చేసినప్పటికీ, కఠిన పరీక్షల తర్వాత గాజర్ కా హల్వా, మూంగ్ దాల్ హల్వా, ఆమ్‌రస్‌కు (మామిడి పండ్ల గుజ్జు) మాత్రమే అంతరిక్ష ప్రయాణానికి అనుమతి లభించిందని చెప్పారు. రాజ్ షమానీ పాడ్‌కాస్ట్‌లో ఇటీవల మాట్లాడిన శుక్లా.. మొదట ఖిచ్‌డీ, పులావ్, పలు కూరలు సహా మరిన్ని భారతీయ వంటకాలను అంతరిక్షంలోకి తీసుకెళ్లాలని భావించినట్లు తెలిపారు. అయితే అక్కడ ఉండే ఆహారం భద్రత, పోషక విలువలు, సూక్ష్మజీవుల నియంత్రణ, ఎక్కువ రోజులు నిల్వ ఉండే సామర్థ్యం వంటి అనేక పరీక్షలను తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. సమయం సరిపోకపోవడంతో మిగతా వంటకాలకు అవసరమైన అన్ని పరీక్షలు పూర్తికాలేదని వెల్లడించారు. తనతో తీసుకెళ్లిన మూడు భారతీయ వంటకాలను తాను తినలేదని, వాటిని సహచర వ్యోమగాములతో పంచుకున్నానని శుక్లా తెలిపారు. వారు ఆ వంటకాలను ఎంతో ఆస్వాదించారని చెప్పారు. "అంతరిక్షంలో మన ఆహారాన్ని ఇతరులతో పంచుకోవడం కంటే ఆనందం మరొకటి ఉండదు" అని వ్యాఖ్యానించారు. అయితే మిషన్‌లో 13 రోజులు గడిచిన తర్వాత కారం, ఉప్పు ఎక్కువగా ఉండే భారతీయ ఆహారం కోసం ఎంతో ఎదురుచూశానని శుక్లా చెప్పారు. అంతరిక్షంలో శరీరంలో జరిగే మార్పుల వల్ల రుచి, వాసన గ్రహించే సామర్థ్యం తగ్గిపోతుందని, నాసా అందించే ఆహారంలో కూడా సోడియం తక్కువగా ఉంటుందని వివరించారు. దీంతో ఉప్పు, కారం ఉన్న ఆహారం తినాలనే కోరిక ఎక్కువైందన్నారు. భూమికి తిరిగి వచ్చిన తర్వాత తన భారతీయ ఫ్లైట్ సర్జన్ అరటిచిప్స్, భాకర్‌వాడీ తీసుకురావడంతో ఎంతో సంతోషించానని శుక్లా చెప్పారు. ఈ అనుభవం గగన్‌యాన్ మిషన్ కోసం మరిన్ని భారతీయ అంతరిక్ష ఆహారాలను అభివృద్ధి చేయడంలో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## ఉద్యాన పంటలను 'ఎల్-నినో' ప్రభావం నుంచి రక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ

-నంద్యాల జిల్లాకు 4,000 హెక్టార్ల సూక్ష్మ సేద్య లక్ష్యం
-ఫార్మ్ పాండ్స్, వీడ్ మ్యాట్, పీఎండీఎస్ విధానాలను విస్తృతంగా అమలు చేయాలి
-అరటి, ఎండు మిరప, ఉల్లి రైతులందరూ పంట బీమాలో నమోదు కావాలి
-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జూలై 23 వార్త సాక్ష్యం



ఎల్-నినో ప్రభావం కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవం తంగా ఎదుర్కొనేందుకు ఉద్యాన పంటల సాగులో నీటి యాజమాన్యం, పంట సంరక్షణ, సూక్ష్మ సేద్య విధానాలను విస్తృతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ఉద్యానశాఖ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉద్యాన పంటల సాగులో నీటి యాజమాన్యం, పంట సంరక్షణ, సూక్ష్మ సేద్య విధానాలను అమలు చేయాలన్నారు. రైతుల ఆదాయాన్ని పరిరక్షిస్తూ ఉద్యాన పంటల ఉత్పాదకతను నిలబెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణను జిల్లాలో సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఈ-పంట (2025-26) నమోదుల ప్రకారం జిల్లాలో ఉద్యాన పంటలు గణనీయమైన విస్తీర్ణంలో సాగవుతున్నాయని తెలిపారు. జిల్లాలో యాసిడ్ లైమ్ (నిమ్మ) పంటను 1,374 మంది రైతులు 1,960 ఎకరాల్లో, మామిడి పంటను 5,021 మంది రైతులు 10,902 ఎకరాల్లో, బత్తాయి పంటను 1,476 మంది రైతులు 3,035 ఎకరాల్లో సాగు చేస్తున్నారని తెలిపారు. మొత్తం 7,871 మంది రైతులు 15,897 ఎకరాల్లో ఈ ప్రధాన ఉద్యాన పంటలను సాగు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎల్-నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పిఎండిఎస్,తో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను బత్తాయి, నిమ్మ, మామిడి తోటల్లో విస్తృతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ చర్యల ద్వారా నేలలో తేమ నిల్వ ఉండటంతో పాటు మొక్కలు వర్షాభావ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. నీటి కొరతను అధిగమించేందుకు తోటల వద్ద ఫార్మ్ పాండ్స్ (రైతు కుంటలు) నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో బత్తాయి తోటలకు 125, నిమ్మ తోటలకు 75 చొప్పున మొత్తం 200 ఫార్మ్ పాండ్స్ నిర్మించాలని లక్ష్యంగా నిర్ధేశించినట్లు కలెక్టర్ తెలిపారు. తోటల్లో నేల తేమను ఎక్కువకాలం నిల్వ ఉంచి కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించేందుకు వీడ్ మ్యాట్ (మల్చింగ్) వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకోసం జిల్లాలో బత్తాయి తోటల్లో 350 ఎకరాలు, నిమ్మ తోటల్లో 150 ఎకరాలు, మొత్తం 500 ఎకరాల్లో వీడ్ మ్యాట్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచి ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసేందుకు ఈ ఆర్థిక సంవత్సరానికి నంద్యాల జిల్లాకు 4,000 హెక్టార్ల సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) లక్ష్యాన్ని ప్రభుత్వం కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని డ్రిప్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక నీటి పారుదల పద్ధతులను స్వీకరించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు అరటి, ఎండు మిరప, ఉల్లి పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంట బీమాలో నమోదు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉద్యాన రైతులు ప్రభుత్వం అందిస్తున్న మైక్రో ఇరిగేషన్, ఫార్మ్ పాండ్స్, వీడ్ మ్యాట్, పంట బీమా తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఇందుకోసం తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలు (రస్క్ లు) లేదా ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి అర్హత మేరకు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఎల్-నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే సాంకేతిక సూచనలను రైతులకు అందించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## జూలై 30న ఆరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

-1న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం
-ఒక రోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ
-ఆరు జిల్లాల్లో 11,98,044 మంది లబ్ధిదారులు
-రు. 514.42 కోట్లు పంపిణీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, జూలై 23 వార్త సాక్ష్యం



భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ఆగస్టు 1న ప్రారంభిస్తోన్న నేపథ్యంలో ఏపీలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30న చేపట్టనున్నారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసిన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆగస్టు 1వ తేదీన ప్రారంభిస్తున్నారని.. ఈ క్రమంలోనే లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండానే ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో ఒక రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం 11,98,044 మంది లబ్ధిదారులకు రు. 514.42 కోట్లను పంపిణీ చేస్తారని... పెన్షన్ల పంపిణీ కోసం అవసరమైన నగదు ఉపసంహారణ కార్యక్రమాన్ని ఈ నెల 29నే పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ నెల ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

## కర్నూలు జిల్లాలో నేడునిర్వహించే మెగా పీటీఎంను విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, జూలై 23 వార్త సాక్ష్యం




నేడు కర్నూలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ 4.0 (మెగా పీటీమ్ 4.0 ను విజయవంతంగా నిర్వహించాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 4.0 అంశంపై కలెక్టర్ జిల్లా అధికారులు, విద్యా శాఖ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు నిర్వహించనున్న మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రముఖులను ప్రత్యేకంగా ఆహ్వానించి కార్యక్రమంలో భాగస్వాములను చేయాల న్నారు. లీప్ యాప్, గుడ్ పేరెంటింగ్ వంటి అంశాలకు సంబంధించిన అవగాహన వీడియోలను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. లీప్ యాప్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, హాజరైన తల్లిదండ్రులందరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.. ప్రశ్నోత్తరాలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించి వాటిని మరింత ఇంటరాక్టివ్‌గా రూపొందించాలన్నారు. డోనర్ యాప్ ప్రారంభోత్సవం సందర్భంగా ఎవరైనా దాత విరాళం అందిస్తే, ఆ విషయాన్ని సభలో ప్రకటించి, వెంటనే డోనర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. వలసల వల్ల పిల్లల విద్య, భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాన్ని తెలియజేసే నాటికలను తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. దీని ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందుతుందన్నారు తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజన పథకం మిడేమీల్స్ నాణ్యత, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించాలని కలెక్టర్ తెలిపారు.. ప్రతి పాఠశాలలో పండ్ల చెట్లను నాటేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ శాఖ అధికారులకు తెలిపారు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు పలు వినోదాత్మక పోటీలను నిర్వహించాలన్నారు. తల్లుల కోసం రంగవల్లి, లెమన్-స్పూన్, మ్యూజికల్ చైర్స్ పోటీలు, తండ్రుల కోసం తగ్ ఆఫ్ వార్ (తాడు లాగే పోటీ) నిర్వహించి విజేతలను ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమం కింద ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక మెనూ ప్రకారం భోజనం అందించాలని, చిక్కీ కోడిగుడ్డు కూరతో పాటు ఇతర ప్రత్యేక వంటకాలతో పండుగ వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా "తల్లికి వందనం" అనే అంశంపై విద్యార్థులతో నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. మెగా పి.టి.ఎమ్‌ను ప్రతి పాఠశాలలో ప్రజల భాగస్వామ్యం తో విజయవంతంగా నిర్వహిం చి, పాఠశాల--తల్లిదండ్రుల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. టెలి కాన్ఫరెన్స్ లో డిఈఓ సుధాకర్, జిల్లా అధికారులు, మండల విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కర్నూలు జిల్లాలో ఈనెల 25న ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి





-ఆస్పరిలో 'సంజీవని' ప్రారంభోత్సవం -- శాఖల సమన్వయంతో అధికారులు పని చేయాలి
-హెలిప్యాడ్, సభా వేదిక, పీహెచ్‌సీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలన
-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి


కర్నూలు, జూలై 23 వార్త సాక్ష్యం

ఈ నెల 25వ తేదీన ఆస్పరి మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్న 'సంజీవని' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. గురువారం ఆస్పరి మండల కేంద్రంలోని హెలిప్యాడ్, బహిరంగ సభా ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, సీఎంవో కార్యాలయ అధికారులతో కలిసి కార్యక్రమ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 'సంజీవని' కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రోగి ఆసుపత్రికి వచ్చిన నిమిషం నుంచి వైద్య సేవలు పూర్తయ్యే వరకు ప్రతి దశను పారదర్శకంగా, వేగవంతంగా, సౌకర్యవంతంగా నిర్వహించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిం చినట్లు తెలిపారు. సంజీవని కార్యక్రమంలో ప్రతి రోగికి నమోదు నుంచి వైద్య పరీక్షలు, నిపుణుల సలహా, ల్యాబ్, ఫార్మసీ, కౌన్సెలింగ్ వరకు సమగ్ర వైద్య సేవలు ఒకే వేదికపై అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసూతి సేవలు, గర్భిణీల సంరక్షణ, వ్యాక్సినేషన్, కుటుంబ సంక్షేమం తదితర సేవలను ప్రజలకు సులభంగా అందుబాటు లో ఉంచేందుకు స్పష్టమైన సూచిక బోర్డులు, మార్గదర్శకాలు ఏర్పాటు చేసే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు, ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వరకు ప్రతి ఏర్పాటును అత్యంత సమగ్రంగా, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలసిసభా ప్రాంగణానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగినంత తాగునీరు, సదుపాయాలు, పరిశుభ్రమైన పారిశుద్ధ్య ఏర్పాట్లు, అత్యవసర వైద్య సేవలు, అంబులెన్స్ సౌకర్యం, సమర్థవంతమైన ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ప్రణాళిక, నిరంతరాయ విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ మరియు కమ్యూనికేషన్ వ్యవస్థలు, భద్రతా ఏర్పాట్లు, దిశా నిర్దేశక బోర్డులు, ప్రజల రాకపోకలకు అనుకూలమైన మార్గాల ఏర్పాటు వంటి అన్ని అంశాల్లో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమయపాలనతో పూర్తి చేసి, పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని, ఏ చిన్న నిర్లక్ష్యానికీ తావు లేకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డిఎంహెచ్ఓ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, ఆర్ అండ్ బి ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, డిపివో భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

## ఓటర్ల డేటా డిజిటైజేషన్, మ్యాపింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి

-ఎనోమలీస్ పరిష్కారంలో నాణ్యతతో కూడిన వేగం చూపాలి
-మైక్రో ప్లానింగ్‌తో పెండింగ్ మ్యాపింగ్‌లను వేగవంతంగా పూర్తి చేయాలి
-ఓటర్ల డేటా నిర్వహణలో ఖచ్చితత్వం, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలి
-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జూలై 23 వార్త సాక్ష్యం



జిల్లాలో ఓటర్ల డేటా డిజిటైజేషన్, ఫ్యామిలీ మ్యాపింగ్, ఎనోమలీస్ పరిష్కార పనులను తక్షణమే నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుండి రెవెన్యూ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఈఆర్వోలతో ప్రత్యేక ఓటర్ల సమగ్ర నమోదు పురోగతిపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 14,05,443 మంది ఓటర్లలో 12,30,715 మంది ఓటర్ల వివరాలు డిజిటైజ్ చేశారని , వీరిలో 26,414 ఓటర్ల మ్యాపింగ్ పూర్తికాలేదని, ప్రతి నియోజకవర్గం ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు. ఓపెన్‌లో ఉన్న రోల్‌బ్యాక్ కేసులను వెంటనే పరిష్కరించడంతో పాటు పెండింగ్ మ్యాపింగ్‌లను పూర్తి చేసి డేటాను సకాలంలో అప్‌డేట్ చేయాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో కేవలం సంఖ్యల పెరుగుదలకే కాకుండా ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తండ్రి, తల్లి పేర్లలో స్వల్ప తేడాలు, జన్మతేదీల వ్యత్యాసాలు, వయస్సు సంబంధిత సాంకేతిక లోపాలు వంటి ఎనోమలీస్ ను క్షుణ్ణంగా పరిశీలించి సరైన ధృవీకరణ అనంతరమే క్లియర్ చేయాలని కలెక్టర్ తెలిపారు సంబంధం లేని కుటుంబ సభ్యులతో మ్యాపింగ్ చేయకుండా నిబంధనల ప్రకారం మాత్రమే డేటాను నమోదు చేయాలని సూచించారు. జీరో ప్రగతి నమోదైన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, మిగిలిన మ్యాపింగ్‌లను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఆర్డీవో, తహసీల్దార్ తమ పరిధిలోని సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట అదనపు సిబ్బందిని వినియోగించాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి, మైక్రో ప్లానింగ్‌తో పనులు నిర్వహించాలని, నిర్ణీత గడువులోగా మ్యాపింగ్, డిజిటైజేషన్, ఎనోమలీస్ పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు

# పిఎండిఎస్ కింద లక్ష ఎకరాలు సాగు చేయాలి

-వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి
-ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో వారానికి 50 ఎకరాలు పిఎండిఎస్ కింద సాగు చేయాలి
-కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి

కర్నూలు, జూలై 23 వార్త సాక్ష్యం

జిల్లాలో పిఎండిఎస్ కింద మరో లక్ష ఎకరాలు సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.గురువారం పిఎండిఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) అంశంపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో జిల్లాలో తగిన వర్షపాతం లేనందున రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు..రైతులకు లాభదాయకంగా ఉండే విధంగా సాగు విధానాల గురించి అవగాహన కల్పించాలన్నారు.. పిఎండిఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) విధానంలో సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.. ఈ విధానంలో ఇప్పటికే 80 వేల ఎకరాల్లో సాగు చేయడం జరిగిందని, మరో లక్ష ఎకరాల్లో సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను లక్ష్యాల సాధనకు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. వ్యవసాయ శాఖ 55000 ఎకరాలు, ఉద్యాన శాఖ 40 వేల ఎకరాలు, పశుసంవర్ధక శాఖ 5000 ఎకరాలు లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో వారానికి 50 ఎకరాలు కచ్చితంగా పిఎండిఎస్ విధానంలో సాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 408 రైతు సేవా కేంద్రాలు కచ్చితంగా ఈ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. లక్ష్యాలను సాధించకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రధాన పంట తో పాటు అంతర పంటలు, ఆకుకూరలు, తీగ జాతి కూరగాయలు సాగు చేసి, రైతులకు ఆదాయం లభించే విధంగా చైతన్యవంతులను చేయాలన్నారు. అలాగే ఎండు మిర్చి వల్ల రైతులకు ఆదాయం ఎక్కువ వచ్చే అవకాశం ఉన్నందు మిరప పంట ను యాజమాన్య పద్ధతుల్లో సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి లక్ష్యాలను సాధించేలా గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను కోరారు. జూలై 31 వ తేదీ లోపు రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా పథకాల కింద పంటల బీమా ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని



కలెక్టర్ అధికారులను కోరారు. రుణం తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా ప్రీమియం చెల్లించాలని, రుణం తీసుకోని రైతులు మీసేవ సెంటర్ ద్వారా ప్రీమియం చెల్లించేలా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిలకు తెలిపారు. విభక్తి సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజా కృష్ణా రెడ్డి, పశు సంవర్ధక శాఖ జేడీ, డివిజన్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు , రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాలో మెగా పీటీఎం-4.0 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

-ప్రతి తల్లిదండ్రి భాగస్వామ్యంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధే మెగా పీటీఎం లక్ష్యం
-నేడుజిల్లాలోని 1,391 పాఠశాలలు, 80 కళాశాలలో మెగా పీటీఎం-4.0 నిర్వహణ
-నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జూలై 23 వార్త సాక్ష్యం

నేడు నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి మెగా పీటీఎం ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెగా పీటీఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య సమన్వయం ఏర్పడి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి దోహదపడేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, అభ్యాస సామర్థ్యం, ప్రవర్తన, ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలు ఆరోగ్య పరిస్థితి, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై తల్లిదండ్రులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జూలై 24వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జిల్లాలోని 1,391 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 80 కళాశాలల్లో ఒకేసారి మెగా పీటీఎం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ద్వారా తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, దాతలను కూడా కార్యక్రమానికి ఆహ్వానించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించే మెగా పీటీఎంకు తల్లిదండ్రులు, విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. సమావేశంలో సంబంధిత ఉపాధ్యాయులు విద్యార్థుల చదువు, హాజరు, విద్యా ప్రగతి, అభ్యాస స్థాయి, ప్రవర్తన తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరించి అవసరమైన సూచనలు అందించాలని తెలిపారు. అలాగే 'తల్లికి వందనం' పథకం కింద లబ్ధి పొందిన విద్యార్థుల వివరాలను తల్లిదండ్రులకు తెలియజేసి, పథకం లక్ష్యాలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని చెప్పారు జిల్లా, మండల స్థాయి అధికారులు ముందుగా రూపొందించిన మ్యాపింగ్ ప్రకారం తమకు కేటాయించిన పాఠశాలలకు హాజరై కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం రూపొందించిన మినిట్-టు-మినిట్ కార్యాచరణ ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద ప్రభుత్వం నిర్దేశించిన మెనూనే అందించాలని స్పష్టం చేశారు. మెనూలో ఎలాంటి మార్పులు చేయరాదని కలెక్టర్ తెలిపారు. ప్రతి తల్లిదండ్రి మొబైల్ ఫోన్‌లో లీప్ యాప్ ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేయించి, లాగిన్ ప్రక్రియను పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి, యాప్ ద్వారా విద్యార్థుల హాజరు, మార్కులు, ఆరోగ్య వివరాలు, మధ్యాహ్న భోజన సమాచారం వంటి సేవలను ఎలా వినియోగించుకోవాలో తల్లిదండ్రులకు




ప్రత్యక్షంగా వివరించాలని సూచించారు. అలాగే డోనర్ యాప్ వినియోగంపై కూడా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుతో పాటు హెల్త్ కార్డును తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. ఇంకా ఆరోగ్య పరీక్షలు పూర్తి కాని విద్యార్థులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమన్వయం చేసి పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య వివరాలను వెంటనే నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో మెగా పీటీఎంను విజయవంతంగా నిర్వహించి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల అభ్యాస నాణ్యతను మెరుగుపరిచే దిశగా ప్రతి అధికారి, ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

# ఎల్-నినో ప్రభావాన్ని ఎదుర్కొనే పంటలు సాగు చేయాలి

-వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుందాం
-ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలి
-జూలై 31లోగా అర్హులైన ప్రతి రైతు పంట బీమాలో నమోదు కావాలి
-కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల జారీని వేగవంతం చేయాలి
-పీఎండీఎస్ విధానాలతో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలి
-జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

నంద్యాల, జూలై 23 వార్త సాక్ష్యం

జిల్లాలో సంభవించే ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని పాటు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎల్-నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారు లతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు ప్రణాళిక లు రూపొందించుకునేలా వ్యవసాయ శాఖ అధికారు లు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటల సాగును, ప్రోత్సహించాలన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి, మొక్కజొన్న వంటి అధిక నీటి అవసరమున్న పంటల సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. వాటికి బదులుగా మినుము, కంది, జొన్న, సజ్జ, కొర్ర, ఆముదం వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేయాలని సూచించారు.జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటల వివరాలను ఎలాంటి ఆలస్యం లేకుండా ఈ-క్రాప్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే పంట బీమా నమోదుపై ప్రత్యేక దృష్టి సారించి, జూలై 31వ తేదీలోగా అర్హులైన ప్రతి రైతు తప్పనిసరిగా పంట బీమాలో నమోదు చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో కౌలు రైతులు అధిక సంఖ్యలో ఉన్నందున, అర్హులైన ప్రతి కౌలు రైతుకు సీసీఆర్సీ, కార్డులు సకాలంలో జారీ అయ్యేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ ( పిఎండిఎస్ ) విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ విధానం ద్వారా నేలలో జీవపదార్థం (బయోమాస్) పెరగడంతో పాటు తేమ ఎక్కువకాలం నిల్వ ఉండి, తక్కువ వర్షపాతం ఉన్నా పంటల ఎదుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు.ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సేంద్రీయ వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలపై రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. చిన్నపాటి వర్షాలతోనే మెరుగైన మొలకలు వచ్చేలా



విత్తనాల పెల్లెటింగ్ విధానాన్ని ప్రోత్సహించాలని, అలాగే స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక పంటల మిశ్రమ విత్తనాల వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయానికి సంబంధించిన అన్ని సేవలు రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, విత్తనాలు, ఎరువులు, పంట బీమా, ఈ-క్రాప్ నమోదు తదితర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనా రైతు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అన్ని స్థాయిల్లో అండగా నిలవాలని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు సకాలంలో సాంకేతిక సలహాలు, ప్రత్యామ్నాయ సాగు సూచనలు, విత్తనాలు, పంట బీమా, ఈ-క్రాప్ నమోదు తదితర సేవలను సమర్థవంతంగా అందించి వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు

## శ్రీశైలం మల్లన్న సేవలో మాజీ మంత్రి సిద్ధ రాఘవరావు దంపతులు

-అమ్మవారికి బంగారు గాజులు సమర్పణ
-ఆలయం మర్యాదలతో ఆహ్వానం పలికిన ఈవో ఎం శ్రీనివాసరావు



శ్రీశైలం జూలై 23 వార్త సాక్ష్యం



శ్రీశైలం మల్లన్న సేవలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీమం త్రివర్యులు సిద్ధారా ఘవరావు దంపతులు, గురువారం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మల్లి కార్జున స్వామి భ్రమరాంబిక దేవి ఆశీస్సులతో ప్రత్యేక పూజలు నిర్వహిం చుకున్నారు ముందుగా ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు మర్యాదపూ ర్వకంగా ఆహ్వానం పలికారు అనంతరం అమ్మవారికి బంగారు గాజులు దేవస్థానమునశీ అధికారులకు సమర్పించారు. ఈ బంగారు గాజుల మొత్తం బరువు 186 గ్రాములు. వీటి విలువ సుమారు రూ. 27లక్షలకు పైగా ఉంటుందని దాతలు తెలిపారు. ఈ బంగారు గాజులతో పాటు దేవస్థాన నిత్యప్రసాదవితరణ పథకానికి రూ. 3 లక్షల నగదును ఆలయ అధికారులకు అందజేశారు. బంగారు గాజులను అన్నప్రసాద వితరణ విరాళం మొత్తాన్ని అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో క స్వామివార్ల ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు యం. శ్రీధర్ శర్మ తదితర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం దాత సిద్ధారాఘవరావు, లక్ష్మీపద్మావతమ్మ దంపతులకు తగు రశీదులను అందజేసి వేదాశీర్వచన ముతో పాటు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేయడం జరిగింది. మల్లన్న సేవలు మాజీ మంత్రి దంపతులకు ఆలయం మర్యాదలతో ప్రత్యేక దర్శనం భాగ్యం కల్పించారు.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకలు

ఆత్మకూరు జూలై 23 వార్త సాక్ష్యం




భారత స్వాతంత్రం ఉద్యమంలో సాయుధ పోరాటం చేసి అమరు డైన వీరుడు దేశం గర్వించదగ్గ దీరుడు భగత్ సింగ్ మరియు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి వేడుకల సందర్భంగా గురువారం పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ముందుగా సిపిఐ పార్టీ తాలూకా కార్యదర్శి టీ ప్రతాప్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ తాలూకా నాయకులు ప్రతాప్ మాట్లాడుతూ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి వారిని ఎప్పుడూ స్మరించుకుంటూ ఉండాలని గుర్తు చేశారు చంద్రశేఖర్ ఆజాద్ చేసిన సేవల్ని కొనియాడారు ఈ కార్యక్రమంలో సిపిఐ తాలూకా కార్యదర్శి ఎం శివ నారాయణ ఎన్ ఎఫ్ డబ్ల్యూ మహిళా సంఘం తాలూకా కార్యదర్శి పి మూర్తి జాబి ఏఐటీయూసీ హమాలి సీనియర్ నాయకులు ఎస్.కె చాంద్ బాషా జాకీర్ రఫీ అన్వర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## వెలుగోడు పట్టణంలో వర్షం కోసం క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు

-వర్షాలు సమృద్ధిగా కురవాలి. పాడి పంటల అభివృద్ధి చెందాలి.
-వెలుగోడు పట్టణంలో వందల సంఖ్యలో క్రైస్తవుల ఉపవాస ప్రార్థనలు.

వెలుగోడు జూలై 23 వార్త సాక్ష్యం





వెలుగోడు పట్టణ కేంద్రంలోని తెలుగు గంగా రిజర్వాయర్ సమీపంలో ఉన్న మైదానంలో క్రైస్తవులు వర్షం కోసం ఉపవాస ప్రార్థనలు చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు ఉపవాస ప్రార్థనలు చేసి ఏసుక్రీస్తు ప్రభువా. వర్షం దయచేయావా..అని మొర పెట్టారు. వర్షం గురించి బైబిల్ గ్రంథము నుండి కొన్ని వాక్యాలను యునైటెడ్ పాస్టర్స్ ఆధ్వర్యంలో దైవ సేవకులు ఏబీఎం ఫీల్డ్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బాలరాజు, సిఎస్ఐ పాస్టర్ అనిల్, పాస్టర్ విక్టర్, పాస్టర్ ప్రసాద్, పాస్టర్ పేతురు, పాస్టర్ రమేష్, పాస్టర్ జయరాజ్, పాస్టర్ సురేష్ లు చదివి వివరించారు.చదివిన వాక్య ప్రకారం క్రైస్తవులందరూ ప్రార్థనలు చేశారు. రాష్ట్రమంతటా వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవుని వేడుకున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు బాగా పండాలని రైతులు సంతోషంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులో కుంటలు జలాశయాలు నిండాలని వ్యవసాయం పాడి పరిశ్రమల అభివృద్ధి చెందాలని వేడుకున్నారు. రైతులు వేసిన పంటలు సమృద్ధిగా పండి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దేవునికి మొర పెట్టారు. ఏసుక్రీస్తు ప్రభువుకు క్రైస్తవులు ఉపవాస ప్రార్థన చేస్తుండగాని అద్భుతంగా వర్షం ఆ ప్రాంతంలో వర్షం రెండుసార్లు కురిపించారు. క్రైస్తవులందరూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సమృద్ధి అయిన వర్షాలు కురవాలని దేవుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం
VARTHA SAKSHAMU
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
శుక్రవారం 24 జూలై 2026

## ఆత్మకూరులో ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్' యాప్‌పై అవగాహన

**-ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ.సత్యనారాయణరెడ్డి**

ఆత్మకూరు జులై 23 వార్త సాక్ష్యం



రవాణా రంగాన్ని మరింత బలోపేతం చేస్తూ, పారదర్శకత, వేగవంతమైన సేవలందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ మారిటైమ్ బోర్డు (ఏపీఎంబీ) మరియు యూనిఫైడ్ లాజిస్టిక్స్ ఇంటర్‌ఫేస్ ప్లాట్‌ఫాం (ఉలిపి) సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) ఏవి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలోని లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు, ఫ్లీట్ ఓనర్లు మరియు రవాణా సంస్థలన్నింటినీ ఒకే డిజిటల్ లాజిస్టిక్స్ వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన పేర్కొన్నారు. జాతీయ లాజిస్టిక్స్ విధానానికి అనుగుణంగా రూపుదిద్దుకున్న ఈ వేదిక ద్వారా రవాణాదారులకు సులభమైన సమాచార మార్పిడి, తక్కువ పేపర్‌వర్క్, వేగవంతమైన ధృవీకరణలతో పాటు విస్తృత వ్యాపార అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఈ డిజిటల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ నంద్యాల జిల్లాలోని లారీ యజమానులు, రవాణాదారులు, ఆపరేటర్లు అందరూ https://transportconnect.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఏపీ ట్రాన్స్‌పోర్ట్ కనెక్ట్ యాప్‌లో వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి (డిటిఓ) జి.వి. శివారెడ్డి కోరినట్లు ఎంవీఐ సత్యనారాయణరెడ్డి తెలియజేశారు.

## రాష్ట్రంలోజీవో నెంబరు 396 రద్దు చేయాలి

**-ఆత్మకూరు దస్తావేజు లేఖరుల సమ్మెకు సిఐటియు మద్దతు**



ఆత్మకూరు జులై 23 వార్త సాక్ష్యం

జీవో నెంబర్ 396 రద్దు చేయాలని, రిజిస్టర్ సేవా కేంద్రాలు పెట్టరాదని దస్తావేజు లేఖర్ల వ్యవస్థ యధావిధిగా కొనసాగించాలని ఆత్మకూరు దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షులు లక్ష్మణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ ఏం నాగేంద్రప్ప, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ లు అన్నారు. గురువారం పట్టణంలోని రిజిస్టర్ కార్యాలయం దగ్గర దస్తావేజు లేఖరులు నాలుగో రోజు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు సిఐటియుగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దస్తావేజు లేఖర్ల వ్యవస్థ పటిష్టముగా చేసి, లేఖర్ల లైసెన్స్ లను పునరుద్ధరణ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వము తక్షణమే దస్తావేజు లేఖర్ల సమ్మెపై స్పందించి వారి సమస్యలు పరిష్కరించి భరోసా కల్పించాలన్నారు. ఈ సమ్మెలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, దస్తావేజు లేఖరులు మోహిద్దీన్, షఫీవుల, శశిధర్, కిరణ్ కుమార్, రాఘవేంద్ర, శ్రీను, రమేష్, ప్రతాప్, ఖాదర్, రజాక్, సందీప్, కైఫ్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి మూలం



బాపట్ల జూలై 23 వార్త సాక్ష్యం

సమాజాభివృద్ధికి మహిళా చైతన్యం అత్యంత అవసరమని, ఆ దిశగా జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని బాపట్ల మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ నెల 26న ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సమత మహిళ వర్క్‌షాప్ ప్రచారంలో భాగంగా గురువారం కమిషనర్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జనాభాలో సగభాగం ఉన్న మహిళలను సామాజికంగా, విద్యాపరంగా చైతన్యవంతులను చేయడానికి జన విజ్ఞాన వేదిక చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ, ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26న ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే రాష్ట్రస్థాయి సమత మహిళ వర్క్‌షాప్‌లో మహిళల విద్య, ఆరోగ్యం, చట్టాలు, సాధికారత, రాజ్యాంగబద్ధ హక్కులు, స్వావలంబన, భారత భవిష్యత్తులో మహిళల పాత్ర వంటి కీలక అంశాలపై ప్రముఖులు, విద్యావేత్తలు, రాష్ట్ర నాయకులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగం నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి, మానవతా చైర్మన్ డాక్టర్ బి. శరత్‌బోస్, గురజాల శ్రీనివాసరావు, జ్యోత్స్న, వంకాయలపాటి హరిబాబు, రోజ్ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో జరిగే శ్రావణమాస ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం





**-ఆగస్టు 13న శ్రావణమాసోత్సవాలు ప్రారంభం**

**-సెప్టెంబరు 12వ తేదీన ముగియనున్న శ్రావణమాసోత్సవాలు**

**-శ్రావణమాసోత్సవాలపై ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించిన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు**

**-రాబోవు ధర్మకర్తల మండలి సమావేశంలో ఉత్సవ నిర్వహణకు సంబంధించి కూలంకష చర్చ**

శ్రీశైలం జులై 23 వార్త సాక్ష్యం

శ్రీశైల పుణ్యక్షేత్రంలో శ్రావణశుద్ధ పాడ్యమి, ఆగస్టు 13 నుంచి శ్రావణ మాసోత్సవాలు, భాద్రశుద్ధ పాడ్యమి సెప్టెంబరు 12 ఉదయాన ఈ మాసోత్సవాలు ముగించే విధంగా ఉంటాయని ఈ మాసోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి ఆలయ కార్యనిర్వహణా ధికారియం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అర్చకస్వాములు, వేదపండితులు, డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ శ్రావణమాస ఏర్పాట్లపై రాబోవు ధర్మకర్తల మండలి సమావేశంలో కూలంకషంగా చర్చించి తదనుగుణంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ శ్రావణమాసోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శిస్తారన్నారు. ముఖ్యం గా శ్రావణమాసంలో రద్దీ దృష్ట్యా అన్ని విభాగాలు తగు ముందస్తు ప్రణాళికలతో ఉత్సవ నిర్వహణకు సిద్ధం కావాలని ఆదేశించారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని విభాగాల అధికారులుఏర్పాట్లను చేయాలని ఆదేశించారు శ్రావణమాసములో ముఖ్యంగా శ్రావణ సోమవారాలు, శ్రావణపౌర్ణమి, వరలక్ష్మీవ్రతం, శుద్ధ మరియు బహుళ ఏకాదశి , శ్రావణమాస శివరాత్రి ప్రభుత్వ సెలవురోజులలో అధికసంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉందన్నారు. ఆయా విభాగాల వారీగా చేపట్టవలసిన చర్యల గురించి కార్యనిర్వహణాధికారి దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా భక్తులందరికీ కూడా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకుగాను అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఆలయ పరిధిలో క్యూకాంప్లెక్సు విభాగాన్ని ఆదేశించారు. క్యూలైన్లలో వేచివుండే భక్తుల సౌకర్యార్థం భక్తులందరికీ కూడా ఎప్పటికప్పుడు మంచినీరు, అల్పాహారం బిస్కెట్లను అందజేయాలని అన్నప్రసాద వితరణ విభాగాన్ని కోరారు. అదేవిధంగా భక్తుల రద్దీకనుగుణంగా అన్నదానమందిరంలో అన్నప్రసాద వితరణను, సాయంకాలం అల్పాహారాన్ని ఏర్పాటు చేయాలని అన్నదాన విభాగాన్నికి తెలియజేశారు. అన్నప్రసాదవితరణలో వండిన వంటకాలన్నీ ప్రతీ భక్తుడికి అందాలన్నారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తుడికి కూడా ప్రతీ వంటకం అందాలన్నారు. భక్తులరద్దీకనుగుణంగా అవసరమైన మేరకు లడ్డూప్రసాదాలను తయారు చేసి అందుబాటులో ఉంచాలని ప్రసాదాల విభాగాన్ని తెలిపారు భక్తులు లడ్డూప్రసాదాల కోసం అధికసమయం వేచివుండకుండా త్వరితంగా లడ్డూప్రసాదాలను అందజేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరం మేరకు అదనపు లడ్డు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ప్రసాదాల విక్రయ విభాగాన్ని రద్దీరోజులలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని భద్రతా విభాగాన్ని ఆదేశించారు. ఈ విషయమై స్థానిక పోలీస్ శాఖ వారి సహకారాన్ని పొందాలని సూచించారు. భక్తులరద్దీ దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాలను తొలగించేందుకు తగు చర్యలు చేపట్టాలని పారిశుద్ధ్య విభాగాన్ని తెలిపారు .ఎప్పటి వలనే సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించేందుకు ఆయా ఏర్పాట్లను చేయాలని ఆలయ . అదేవిధంగా ప్రతీ సంవత్సరం వలనే శ్రావణ అఖండ శివనామ భజనలకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని ఆదేశించారు. మొత్తం మీద భక్తులకు, ముఖ్యంగా సర్వదర్శనం క్యూలైన్లలోని సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని విభాగాలను కోరినట్లు ఆయన ఈ సమావేశంలో వెల్లడించారు.

# కమ్యూనిటీ హెల్త్ ప్రియాంక కుమార్ ల పెళ్లి వేడుకలో పలువురు ప్రముఖులు





పాములపాడు జూలై 23 వార్త సాక్ష్యం

జూపాడుబంగ్లా మండలం ప్రాతకోట గ్రామంలో నీ సిఎస్ఐ చర్చి సంఘం ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కుందూ ప్రియాంక చిమ్మే. కుమార్ ల వివాహ వేడుకల్లో పాల్గొన్న పాములపాడు ప్రముఖులు డాక్టర్. ఇవి నాగలక్ష్మి దేవి, డాక్టర్. ఎం మహమ్మద్ బెగ్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున ఫార్మసిస్ట్ మూస సలాం, సిహెచ్ఓ అన్నమ్మ, ఎం ఎల్ హెచ్ పి లు మరియు వైద్య సిబ్బంది పాములపాడు సోషల్ మీడియా ప్రతినిధి డక్క. శ్రీకాంత్, శ్వేత, ఆశాలు, మరియు తదితరులు పాల్గొని నూతన వధూ వరులకు పెళ్లి ఫోటో చిత్ర పటం బహుమతిగా ఇవ్వడం జరిగింది. పెళ్లి వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమం లో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది. వచ్చిన వారందరికీ వివాహ తేనీటి విందులో పాల్గొనడం జరిగింది.

**-పెళ్లి గురించి బంధాన్ని బలపరిచే కొన్ని ముఖ్య సూత్రాలు .....**

జూపాడుబంగ్లా మండల ప్రాతకోట గ్రామంలో జరిగిన పెళ్లి వేడుకల్లో ఒక ప్రముఖుడు పెళ్లి గురించి బంధాన్ని గురించి బలపరిచే కొన్ని ముఖ్య విషయాలు అవి... భారత సమాజ నిర్మాణ మూల స్థంభాల్లో వివాహ బంధం ఒకటి. వివాహం పవిత్రమైన ది. భగవంతుడు మనకు అప్పగించిన బాధ్యతలో అన్ని నిర్వహించడానికి వివాహం చేసుకుంటామని భారతదేశం లో భావిస్తారు. భాగస్వామి, అబిప్రాయం లను, వ్యక్తి గత, స్వేచ్ఛను, గౌరవించడం కుటుంబ సభ్యులను మరియు నిర్ణయాలను ఇద్దరు పంచుకోవడం కష్టసుఖాల్లో ఒకరి ఒకరు తోడుగా ఉంటూ బంధాన్ని కాపాడుకోవడం వివాహం కేవలం ఒక బంధం మాత్రమే కాదు ఇది ఇద్దరు వ్యక్తులు కలయిక ద్వారా సమాజానికి కుటుంబం వ్యవస్థ కు స్థిరత్వాన్ని నైతిక విలువలను అందించే ఒక పవిత్రమైన వ్యవస్థ. వివాహ వ్యవస్థ కుటుంబానికి ఒక రూపం వస్తుంది. ఇది పిల్లల తరాల ఆరోగ్యకరమైన అభివృద్ధి కి అత్యంత సురక్షితమైన వాతావరణం నీ సృష్టిస్తుంది. అని చాలా చక్కగా పెళ్లి గురించి వివరించడం జరిగింది.

# పాములపాడు మండల కేంద్రంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్యకు ఘన స్వాగతం

**-జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు**

**-మాల మహానాడు నాయకులు అంకన్న ఆధ్వర్యంలో ఘన సన్మానం**

పాములపాడు జులై 23 వార్త సాక్ష్యం



పాములపాడు మండల కేంద్రంలో గురువారం నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య పలు ప్రభుత్వ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు బాలికల వసతి సంక్షేమ గృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు ఉమ్మడి జిల్లాల మాల మహానాడు సీనియర్ నాయకులు కలబండి అంకన్నలు ఎమ్మెల్యే గిత్త జయసూర్యను పూల పుష్పం శాలువాలతో ఘనంగా సన్మానించి మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికారు ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు అంకన్న మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గ అభివృద్ధి పథకంలో నడిపిస్తూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య అని కొనియాడారు ముఖ్యంగా కూటమిపాలనలో అభివృద్ధి సంక్షేమం వైద్యం విద్య తోపాటు ప్రజాపాలనకు అన్ని విధాలుగా అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి గిత్త జయసూర్యతోనే సాధ్యమవుతుందని మాల మహానాడుసీనియర్ నాయకులు కలబండి అంకన్న తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాములపాడు మండలం అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు మాల మహానాడు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

బాపట్ల జూలై 23 వార్త సాక్ష్యం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, విద్యా వ్యవస్థలో అవకతవకలకు నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఈ నెల 24న నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ (SFI) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఇంజినీరింగ్, టెక్నికల్ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలకు బంద్ నోటీసులను అందజేశారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శికి కూడా నోటీసు అందించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన ఆందోళనలను పట్టించుకోకుండా ప్రభుత్వం వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. శాస్త్రీయ, పారదర్శక విద్యా విధానాల కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం చేస్తోందని, విద్యార్థుల భవిష్యత్తుకు భంగం కలిగించే విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూలంగా ప్రభుత్వాలు వ్యవహరించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరిం చాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్ నోటీసుల పంపిణీ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఏ. కిరణ్, జోని, మాజీ నాయకుడు టి. కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎంఆర్‌ఎఫ్ తో ప్రాణాలకు భరోసా

భట్టిప్రోలు జూలై 23 వార్త సాక్ష్యం

భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామానికి చెందిన పరుచూరి శ్రీనివాసరావుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.10 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (LOC) మంజూరైంది. ఈ మేరకు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మంజూరైన హామీ పత్రాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స పొందుతున్న శ్రీనివాసరావుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక చొరవ తీసుకుని చికిత్స బిల్లులను ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం రూ.10 లక్షల వైద్యసాయాన్ని LOC రూపంలో మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోంద న్నారు. అత్యవసర వైద్య అవసరాల సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుం బానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఆర్థిక సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, అలాగే సహాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## మహిళల భద్రతకు 'శక్తి యాప్' వినియోగించాలి- ఎస్సై ఖాదర్ బాషా

కారంచేడు

మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలను సహించకుండా వెంటనే 'శక్తి యాప్' లేదా 112 అత్యవసర సేవ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కారంచేడు ఎస్ఐ ఖాదర్ బాషా సూచించారు.బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్ సూచనలతో కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఖాదర్ బాషా మాట్లాడుతూ, బస్టాప్‌లు, పాఠశాలల పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొనే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను ఏ మాత్రం సహించవద్దన్నారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే శక్తి యాప్‌లోని ఎస్ఓఎస్ ఫీచర్ లేదా 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయ ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్న ఆయన, సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళల గౌరవాన్ని కాపాడే బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకుని తమ హక్కులను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కారంచేడు ఏఎస్ఐ ఏ. శివారెడ్డి, శక్తి బృందం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.




# అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష





-మెడికల్ కాలేజీ పనులకు కలెక్టర్ డెడ్ లైన్

-ల్యాబ్‌లు, బ్లడ్ బ్యాంక్ త్వరగా పూర్తి

-వైద్య సేవలపై రోగులతో ముచ్చట

పిడుగురాళ్ల జూలై 23 వార్త సాక్ష్యం

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ఆగస్టు 15 నాటికి ఇన్‌పేషంట్ బ్లాక్, బ్లడ్ బ్యాంక్, ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల అధికారులను ఆదేశించారు.పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలో గురువారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించి నిర్మాణ పనుల పురోగతిని ఒక్కో విభాగంలో పరిశీలించారు. ఇన్‌పేషంట్ బ్లాక్, బ్లడ్ బ్యాంక్, ఆపరేషన్ థియేటర్లు, విండోస్, సీలింగ్, ఎలక్ట్రికల్ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి వినియోగానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.వైద్య విద్యార్థులకు అత్యంత కీలకమైన అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లను అత్యవసర ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సింగ్ విద్యార్థుల కోసం మెస్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసి వెంటనే టెండర్లు పిలవాలని సూచించారు. పనుల్లో జాప్యానికి తావులేకుండా అన్ని విభాగాల్లో అవసరమైన మ్యాన్‌పవర్‌ను పెంచి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వైద్య సేవల నాణ్యత, అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో రాజీ పడొద్దని వైద్యాధికారులకు సూచించారు.

## తొలి ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన



రెంటచింతల జూలై 23 వార్త సాక్ష్యం

కృష్ణానది తీరంలోని సత్రశాలలో వెలసిన శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారి ఆలయంలో ఈ నెల 25న నిర్వహించనున్న తొలి ఏకాదశి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం వివిధ శాఖల అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు.ట్రస్టు బోర్డు చైర్మన్ జీవీ శివయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, జల్లు స్నాన ఏర్పాట్లు, ఆర్టీసీ బస్సుల సౌకర్యం, తాగునీటి వసతి, శాంతి భద్రతలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి, సంబంధిత శాఖలకు అవసరమైన సూచనలు చేశారు.హిందువులకు తొలి ఏకాదశి అత్యంత పవిత్రమైన పర్వదినమని, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.సమావేశంలో తహసీల్దార్ మర్రి దీప్తి, ఎండోమెంట్స్ అధికారి గాదే రామిరెడ్డి, ఎస్ఐ సీహెచ్ నాగార్జున, డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఏఈలు వెంకటేష్, మస్తాన్‌వలి, ట్రస్టు సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భట్టిప్రోలు అభివృద్ధికి కేంద్రమంత్రికి ఎంపీ వినతి



భట్టిప్రోలు జూలై 23 వార్త సాక్ష్యం

బాపట్ల పార్లమెంట్ పరిధిలోని భట్టిప్రోలు బౌద్ధ స్థూపం సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని లోక్‌సభ ప్యానెల్ స్పీకర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు బౌద్ధ స్థూపం అభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి సమర్పించారు.భేటీలో ఎంపీ మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రాచీన బౌద్ధ క్షేత్రాల్లో భట్టిప్రోలు స్థూపం ఒకటని, తెలుగు లిపి మూలాలకు, బ్రాహ్మీ లిపి ఆధారాలకు ఈ ప్రాంతం చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉందని వివరించారు. భట్టిప్రోలు స్థూపాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌లో చేర్చి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు.అదేవిధంగా బాపట్ల పార్లమెంట్ పరిధిలోని చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యమున్న ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని, నియోజకవర్గ అభివృద్ధి పనులకు అండగా నిలవాలని కేంద్ర మంత్రిని ఎంపీ కోరారు.దీనిపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సానుకూలంగా స్పందించి, భట్టిప్రోలు బౌద్ధ స్థూపం అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యమైనంత త్వరగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు.

## సమాజ సేవలో రెడ్డి సేవ మిత్ర

కర్లపాలెం జూలై 23 వార్త సాక్ష్యం



కర్లపాలెం మండలం కర్లపాలెం పంచాయితీ గేమెక్షన్ మిల్లు సమీపంలో నివసిస్తున్న ఓ నిరుపేద మహిళకు రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా మిత్ర సెక్రటరీ ఎట్రా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా కులమతాలకు అతీతంగా పేద ప్రజలకు అండగా నిలుస్తూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు గ్రామాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించడం, విద్యలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం వంటి కార్యక్రమా లను నిరంతరం చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో అవసరమైన చోట సేవా కార్యక్రమాలను విస్తరిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూత అందించడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర అధ్యక్షుడు నంగు గోవర్ధన్ రెడ్డి, కోశాధికారి అట్లా హరిబాబు రెడ్డి, ఎంపీటీసీ షేక్ ఆసిఫ్, శంషీర్ తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## ఒకసారి ఛార్జ్ చేస్తే 526 కి.మీ- కియా నుంచి కొత్త ఈవీ విడుదల



ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో తన ఉనికిని మరింత బలోపేతం చేస్తూ కియా ఇండియా కొత్త సిరోస్ ఈవీని మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధరను రూ.13.49 లక్షలుగా నిర్ణయించింది. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 526 కిలోమీటర్ల వరకు ప్రయాణిం చగలదని కంపెనీ వెల్లడించింది. జులై 30న డెలివరీలు ప్రారంభం కానున్నాయి.సిరోస్ ఈవీని 42 కిలోవాట్ అవర్, 51.4 కిలోవాట్ అవర్.. రెండు బ్యాటరీ ప్యాక్‌లతో అందుబాటులోకి తీసుకొచ్చింది. 42 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 443 కిలోమీటర్లు, 51.4 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 526 కిలోమీటర్ల వరకు రేంజ్ లభిస్తుందని తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో 500 కిలోమీటర్లకు పైగా సర్టిఫైడ్ రేంజ్‌ను అందిస్తున్న తొలి మోడల్‌గా సిరోస్ ఈవీ నిలిచిందని కియా పేర్కొంది.డిజైన్ పరంగా పెట్రోల్ సిరోస్‌ను పోలి ఉన్నప్పటికీ, ఈవీ కోసం ప్రత్యేకంగా క్లోజ్డ్ డిజిటల్ టైగర్ ఫేస్ గ్రిల్, కొత్త బంపర్లు, ఐస్ క్యూబ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, స్టార్ మ్యాప్ లైటింగ్, ఏరో అలాయ్ వీల్స్, ఫ్లష్ డోర్ హ్యాండిల్స్‌ను అందించారు. మొత్తం తొమ్మిది రంగుల్లో ఈ మోడల్‌ను విక్రయిం చనున్నారు. క్యాబిన్‌లో 30 అంగుళాల ట్రినిటీ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, ఎనిమిది స్పీకర్ల హార్మన్ కార్డన్ సౌండ్ సిస్టమ్, ముందు, వెనుక వెంటిలేటెడ్ సీట్లు, పనోరమిక్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఛార్జర్, 16 లీటర్ల ఫ్రంక్ వంటి ఫీచర్లను అందించారు.పెద్ద బ్యాటరీ వేరియంట్ 0 నుంచి 100 కిమీ వేగాన్ని 8.1 సెకన్లలో అందుకుంటుంది. 100 కిలోవాట్ డీసీ ఫాస్ట్ ఛార్జర్‌తో 10 నుంచి 80 శాతం ఛార్జ్ కావడానికి కేవలం 39 నిమిషాలు పడుతుందని కంపెనీ తెలిపింది. భద్రత కోసం ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్-2 ఏడీఏఎస్, 360 డిగ్రీ కెమెరా, బ్లైండ్ వ్యూ మానిటర్, ఈఎస్‌సీ, హిల్ స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఐఎస్ఓఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్ వంటి ఫీచర్లను అందించారు.

## ఇన్ఫోసిస్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ వేతన పెంపు ప్రకటన




ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తమ ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి వేతనాలను పెంచనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గురువారం కంపెనీ మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను వెల్లడించిన సందర్భంగా సీఈఓ సలీల్ పరేఖ్ ఈ కీలక ప్రకటన చేశారు. వేతనాల పెంపు ప్రక్రియ దశలవారీగా ఉంటుందని పరేఖ్ వివరించారు. మెజారిటీ ఉద్యోగులకు అక్టోబర్ నుంచే ఈ పెంపు వర్తిస్తుందని, సీనియర్ స్థాయి ఉద్యోగులకు మాత్రం వచ్చే ఏడాది జనవరి నుంచి వేతనాలు పెరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఐటీ రంగంలో నెలకొన్న తీవ్ర పోటీ నేపథ్యంలో, ప్రతిభావంతులైన ఉద్యోగులను అట్టిపెట్టుకోవడంతో పాటు వారిలో నైతిక స్థైర్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తొలి త్రైమాసిక ఫలితాలపై సలీల్ పరేఖ్ స్పందిస్తూ, ప్రస్తుతం సంస్థ వద్ద భారీ డీల్స్ రూపంలో మెరుగైన వ్యాపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు నెమ్మదించినప్పటికీ, ఈ ఒప్పందాలను ఆదాయంగా మలచుకోగలమన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూనే, కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి లక్ష్యాలను చేరుకునే వ్యూహంలో భాగంగానే ఈ వేతన పెంపు నిర్ణయాన్ని తీసుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఆగని సైబరాసురుల ఆగడాలు- 146 శాతం పెరిగిన ఎస్సెమ్మెస్‌ల స్కామ్‌లు



దేశంలో ఎస్సెమ్మెస్‌ల ద్వారా జరిగే సైబర్ మోసాలు వేగంగా పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే 2026 తొలి అర్ధభాగంలో ఎస్సెమ్మెస్‌ల ఆధారిత మోసాలు 146 శాతం పెరిగినట్లు 'బయోక్యాచ్' నివేదిక వెల్లడించింది. ఇదే కాలంలో మొబైల్ ఫ్రాడ్ సెషన్లు 67 శాతం పెరిగినట్లు పేర్కొంది.నివేదిక ప్రకారం ఐఓఎస్ పరికరాల్లో మొబైల్ మోసాలు 86 శాతం, ఆండ్రాయిడ్‌లో 35 శాతం పెరిగాయి. మరోవైపు వెబ్ బ్రౌజర్‌ల ద్వారా జరిగే మోసాలు మాత్రం 10 శాతం తగ్గాయి. దీంతో సైబర్ నేరగాళు మొబైల్ ఫోన్లనే ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.మోసాల విలువ కూడా పెరుగుతో ందని నివేదిక తెలిపింది. అనుమానాస్పద చెల్లింపులు రెట్టింపు కాగా, ఒక్కో మోసంలో బదిలీ అవుతున్న సగటు మొత్తం 1.7 రెట్లు పెరిగింది. అదే సమయంలో నేరగాళ్లు మరింత వేగంగా డబ్బులు కాజేస్తున్నారని, మోసపూరిత కాల్స్ సెషన్ల వ్యవధి తగ్గడమే అందుకు నిదర్శనమని విశ్లేషించింది. 2025లో దేశవ్యాప్తంగా వివిధ బ్యాంకుల 700కు పైగా శాఖల్లో 8.5 లక్షలకుపైగా 'మ్యూల్ అకౌంట్లు' గుర్తించినట్లు నివేదిక వెల్లడించింది. అలాగే సైబర్ మోసాలకు సంబంధించి రూ.22,496 కోట్ల విలువైన ఫిర్యాదులు నమోదయ్యాయని, 26.48 లక్షల మ్యూల్ అకౌంట్ కేసులు వెలుగులోకి వచ్చాయని తెలిపింది. అనుమానితుల రిజిస్ట్రీ ద్వారా రూ.9,055 కోట్ల మోసాలను అడ్డుకున్నట్లు పేర్కొంది.యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆన్‌లైన్ పెట్టుబడుల వినియోగం వేగంగా పెరగడంతో భారత డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సైబర్ నేరగాళ్లకు ప్రధాన లక్ష్యంగా మారిందని నివేదిక పేర్కొంది. అయితే బ్యాంకులు, ఆర్‌బీఐ, ఐ4సీ, చట్టాన్ని అమలు చేసే సంస్థలు కలిసి పనిచేయడం వల్ల మోసాలను ముందుగానే గుర్తించే సామర్థ్యం మెరుగుపడుతోందని 'బయోక్యాచ్' వెల్లడించింది.

# క్రీడలు

## చైనా ఓపెన్: ముగిసిన సింధు పోరాటం- మారథాన్ పోరులో చెన్ యుఫెయిదే పైచేయి




ఇంటర్నెట్ డెస్క్:

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చైనా ఓపెన్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఆతిథ్య చైనా క్రీడాకారిణి చెన్ యుఫెయి చేతిలో 21-16, 20-22, 18-21 తేడాతో ఓటమి పాలైంది. సుమారు గంటన్నర సేపు జరిగిన ఈ పోరు.. టోర్నీలోనే అత్యుత్తమ మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది. హోరాహోరీ పోరు సాగిందిలా. మొదటి గేమ్ ఆరంభంలో వెనుకబడిన సింధు అద్భుతంగా పుంజుకుంది. విరామ సమయానికి 6-11తో వెనుకబడినా.. వరుసగా 7 పాయింట్లు సాధించి 21-16తో గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. రెండో గేమ్‌లోనూ ఆధిపత్యం కొనసాగించిన భారత క్రీడాకారిణి.. 7-3 ఆధిక్యం సాధించి విరామ సమయానికి ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత మరో 4 పాయింట్లు సాధించి 20-16తో విజయానికి చేరువైంది. అయితే.. కీలక సమయంలో తడబడిన సింధు.. అనవసర తప్పిదాలు చేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న చెన్.. వరుస పాయింట్లు సాధించి 22-20తో గేమ్‌ను కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఇరువురు హోరాహోరీగా తలపడ్డారు. విరామ సమయానికి 11-8తో సింధు ముందంజలో ఉన్నా.. చెన్ క్రమంగా ఒత్తిడి పెంచింది. స్థానిక ప్రేక్షకుల మద్దతుతో మరింత ఆత్మవిశ్వాసంతో చెలరేగిన చైనా స్టార్.. వరుస పాయింట్లు సాధించి 21-18తో గేమ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. కాగా.. ఇటీవల జపాన్ ఓపెన్ సెమీఫైనల్లో గాయంతో మధ్యలోనే తప్పుకున్న చెన్ యుఫెయి.. ఈ గెలుపుతో నాటి ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్టైంది. మరోవైపు.. ఈ పరాజయంతో 2019 తర్వాత వరుసగా ఇద్దరు టాప్-5 ప్లేయర్లను ఓడించే అవకాశాన్ని కొద్ది తేడాతో కోల్పోయింది సింధు.

## చలో..గ్లాస్గో




గ్లాస్గో: మనుపటి తరహాలో అథ్లెట్ల సందడి లేదు.. ప్రచార ఆర్భాటాలూ లేవు. గడచిన మూడు దశాబ్దాల్లో అతి తక్కువ క్రీడాంశాలతో జరిగే 23వ కామన్వెల్త్ క్రీడలకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో గురువారం అధికారికంగా తెరలేవనుంది. 11 రోజులపాటు అలరించే క్రీడలు ఆగస్టు 2న ముగియనున్నాయి. 74 దేశాలకు చెందిన కేవలం 3 వేల మంది అథ్లెట్లు.. 4 వేదికల్లో జరిగే 16 క్రీడాంశాల్లో బరిలోకి దిగనున్నారు వీటిలో పారా క్రీడాంశాలు (6) కూడా ఉన్నాయి. బడ్జెట్ సవాళ్లు ఎదుర్కొంటున్నా.. ఈ మల్టీ స్పోర్టింగ్ ఈవెంట్ స్థాయి మాత్రం ఏమాత్రం తగ్గదని నిర్వాహకులు చెబుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా కామన్వెల్త్ క్రీడల్లో భారత్ పతకాల పట్టికలో టాప్-5లో నిలుస్తూ వస్తోంది. అయితే, గ్లాస్గో క్రీడల్లో మాత్రం అదంత సులువు కాదు. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్‌పైనే భారత్ ఎక్కువ పతక ఆశలు పెట్టుకొంది. పారా క్రీడలు కూడా సమాంతరంగా జరగనున్నాయి. వాస్తవంగా ఆస్ట్రేలియాలోని విక్టోరియా స్టేట్ ఈ క్రీడల ఆతిథ్య హక్కులు దక్కించుకొంది. కానీ, ఖర్చులు అమాంతం పెరిగిపోవడంతో తమవల్ల కాదని నిర్వాహకులు చేతులెత్తేశారు. దీంతో 2014 క్రీడలకు ఆతిథ్యం ఇచ్చిన గ్లాస్గో.. ఆ బాధ్యత తీసుకొంది. అయితే, ఖర్చులో భారీగా కోతలు పెట్టింది. కేవలం రూ. 20 కోట్ల బడ్జెట్‌తోనే ఈవెంట్‌ను ముగించనున్నారు. 2022 బర్మింగ్‌హామ్ క్రీడల బడ్జెట్‌తో పోల్చితే 60 శాతం తక్కువ.

## వైభవ్ సూర్యవంశీ దంచుడు... జింబాబ్వే పై టీమిండియా ఈజీ విక్టరీ





జింబాబ్వే పర్యటనను భారత జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. హరారే వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో) విధ్వంసకర అర్ధశతకంతో చెలరేగడంతో టీమిండియా సునాయాసంగా నెగ్గింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 126 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (1) త్వరగా ఔటయ్యాడు. అయితే, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 19 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లను ఉతికారేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (35) చక్కటి సహకారం అందించడంతో భారత్ విజయం సులువైంది. వీరిద్దరూ ఔటయ్యాక, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), తిలక్ వర్మ (6 నాటౌట్) మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) తన వేగంతో జింబాబ్వే బ్యాటర్లను వణికించాడు. మరో పేసర్ ప్రిన్స్ యాదవ్ (2/19) కూడా రాణించడంతో ఆతిథ్య జట్టు 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వెస్లీ మధెవెరె (39), తడివానశే మరుమాని (27 నాటౌట్) కాసేపు పోరాడినా స్కోరు బోర్డును వేగంగా ముందుకు నడిపించలేకపోయారు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# 'కేస్ ఆఫ్ కొండాన' (ఈటీవీ విన్) మూవీ రివ్యూ!




కన్నడలో విజయ్ రాఘవేంద్రకి మంచి క్రేజ్ ఉంది. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను ఎంచుకుంటూ ఆయన ముందుకు వెళుతున్నాడు. ఆయన హీరోగా రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ సినిమాలలో 'కేస్ ఆఫ్ కొండాన' ఒకటిగా చెప్పుకోవచ్చు. దేవీప్రసాద్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2024లో జనవరి 26వ తేదీన థియేటర్లకు వచ్చింది. అనూహ్యమైన రెస్పాన్స్ ను తెచ్చుకుంది. భావన కీలకమైన పాత్రను పోషించిన ఈ సినిమా, ఈ రోజు (జులై 23) నుంచి 'ఈటీవీ విన్' లో స్ట్రీమింగ్ అవుతోంది.'చామరాజ్ పేట్' పోలీస్ స్టేషన్ విల్సన్ ( విజయ్ రాఘవేంద్ర) కొత్తగా డ్యూటీలో చేరతాడు. అక్కడ ఏఎస్ ఐగా లక్ష్మీ (భావన) ఉంటుంది. ఆమె తండ్రి త్యాగరాజ్ (రంగాయన రఘు) కూడా మరో పోలీస్ స్టేషన్ లో ఏఎస్ ఐగా పనిచేస్తుంటాడు. లక్ష్మీ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా హత్యలు జరుగుతుంటాయి. హంతకుడిని వెతికి పట్టుకునే పనిలో లక్ష్మీ బిజీగా ఉంటుంది. ఆ పోలీస్ స్టేషన్ లో ఇన్ స్పెక్టర్ మహేంద్ర (బలరాజ్ వాడి) ఆమెకి కుడిభుజంగా ఉంటాడు. మహేంద్రకి విల్సన్ కొంత డబ్బు ఇవ్వవలసి ఉంటుంది. తన కారు అమ్మేసి ఇవ్వాలని విల్సన్ నిర్ణయించుకుంటాడు. అదే సిటీలోని ఒక హాస్పిటల్లో డాక్టర్ గా పనిచేస్తున్న 'సహన' (ఖుషీ రవి)ని అతను ప్రేమిస్తుంటాడు. కొన్ని రోజుల క్రితం డాక్టర్ 'సహన' ఒక కేసును చూస్తుంది. రాజు అనే అతని కొడుకు బసంత్ కి పరీక్షలు చేయించి, ట్రీట్మెంట్ కి 5 లక్షలు సిద్ధం చేసుకోమని చెబుతుంది. రాజు అదే ఏరియాలో రోడ్డు పక్కన 'పానీ పూరి' బండి పెట్టుకుని తన జీవనాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. మహేంద్రకి డబ్బు ఇవ్వడం కోసం 'కారు'లో వెళుతున్న విల్సన్ కి, ఆ పానీ పూరి బండి దగ్గరే ప్రమాదం జరుగుతుంది. ఆ సమయంలోనే కారులోని డబ్బును 'రాజు' కాజేస్తాడు. ఆ డబ్బు కోసం రాజు – విల్సన్ మధ్య జరిగిన పెనుగులాటలో రాజు చనిపోతాడు. అప్పుడు విల్సన్ ఏం చేస్తాడు? ఎలాంటి పరిణామాలను ఎదుర్కొం టాడు? అనారోగ్యంతో బాధపడు తున్న రాజు కొడుకు పరిస్థితి ఏమిటి? వరుసగా జరుగుతున్న హత్యలకు కారకులు ఎవరు? అనే ఆసక్తికరమైన మలుపులతో ఈ కథ ముందుకు వెళుతుంది.ఇది ఒక పోలీస్ ఆఫీసర్ కథ. సిన్సియర్ ఆఫీసర్ గా పేరు తెచ్చుకోవాలనే పట్టుదలతో డ్యూటీలో దిగిన విల్సన్, అనుకోని సంఘటనతో హంతకుడిగా నిలబడిపోతాడు. ఆ నేరం నుంచి బయటపడటం కోసం అతను చేసే ప్రయత్నాలు, మరిన్ని దారుణాలకు కారణమవు తాయి. అలాంటి పరిస్థితులలో అతను ఏం చేస్తాడు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు.



## చిన్న సినిమాల్లోనే దమ్ముంటుంది: 'కర్మాఖ్య' ఈవెంట్‌లో విజయశాంతి

కొత్త ఆలోచనలు, వినూత్న కథలతో వచ్చే చిన్న సినిమాలకు ప్రేక్షకులు, మీడియా నుంచి మరింత ప్రోత్సాహం అందాల్సిన అవసరం ఉందని ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతి అభిప్రాయపడ్డారు. అలాంటి చిత్రాలకు సరైన గుర్తింపు దక్కితే తెలుగు సినీ పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. 'అదిరే అభి' (అభినయ కృష్ణ) దర్శకత్వంలో తెరకెక్కిన 'కర్మాఖ్య' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయశాంతి ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ వేడుకలో విజయశాంతి మాట్లాడుతూ... "పెద్ద సినిమాలతో పోలిస్తే చిన్న చిత్రాలకు లభించే మద్దతు కాస్త తక్కువే అయినప్పటికీ, నిజమైన దమ్ము, కొత్తదనం, బలమైన కథలు చిన్న సినిమాల్లోనే ఉంటాయి. ప్రేక్షకులు ఇలాంటి వైవిధ్యమైన ప్రయత్నాలను ఆదరిస్తే పరిశ్రమకు మరింత మంది కొత్త నటీనటులు, దర్శకులు వస్తారు. ముఖ్యంగా చిన్న సినిమా నిర్మాతలు నిలదొక్కుకోవాలంటే మీడియా సహకారం చాలా అవసరం. కొత్త కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లడంలో మీడియానే కీలక పాత్ర పోషిస్తుంది" అని పేర్కొన్నారు. 'కర్మాఖ్య' సినిమాలో నటించిన అభినయ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ... ఈ పాత్ర కోసం ఆమె గుండు చేయించుకోవాల్సిన అవసరం లేదని, కానీ కథపై ఉన్న అంకితభావంతోనే అలా చేశారని విజయశాంతి అభినందించారు. ఆమె పడిన కష్టానికి ప్రేక్షకులు కచ్చితంగా పెద్ద విజయాన్ని అందిస్తారనే నమ్మకం ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఇక తన నటన కెరీర్ పై స్పందిస్తూ... ప్రస్తుతం తాను రాజకీయాల్లో బిజీగా ఉన్నందున నటించే ఆలోచన లేదని... అయితే బలమైన కథ, గుర్తుండిపోయే మంచి పాత్ర వస్తే మాత్రం ఆలోచిస్తానని వెల్లడించారు. కాగా, ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ 'కర్మాఖ్య' చిత్రం జూలై 31న థియేటర్లలోకి రానుంది.



## బిగ్ బాస్ అవకాశాన్ని వదులుకున్నా కారణం ఇదే: సత్యశ్రీ



బుల్లితెరపై పాపులర్ కామెడీ షో 'జబర్దస్త్' ద్వారా గుర్తింపును సంపాదించుకున్న నటి సత్యశ్రీ. ముఖ్యంగా చమ్మక్ చంద్ర టీమ్‌లో సుదీర్ఘకాలం అలరించిన ఆమె, తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆ గుర్తింపుతోనే వెండితెరపైనా వరుస అవకాశాలు దక్కించుకుంటూ నటిగా ముందుకు సాగుతోంది. అయితే గత కొంతకాలంగా ఆమె బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షో 'బిగ్‌బాస్'లోకి ఎంట్రీ ఇవ్వబోతోందంటూ నెట్టింట ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే.తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సత్యశ్రీ ఈ ప్రచారంపై స్పందిస్తూ అసలు నిజాలను వెల్లడించింది. తనకు బిగ్‌బాస్ నిర్వాహకుల నుంచి పిలుపు వచ్చిందనేది వాస్తవమేనని, ఆఫర్ వచ్చిందని స్పష్టం చేసింది. అయితే ఆ క్రేజీ అవకాశాన్ని తాను ఒప్పుకోలేకపోయానని తెలిపింది. తనపై కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయని, ఇంటి బయట తాను చూసుకోవాల్సిన పనులు చాలా ఉన్నాయని పేర్కొంది. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను వదిలి సుదీర్ఘకాలం దూరంగా ఉండటం తన వల్ల కాదని, అందుకే బిగ్‌బాస్ ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె టీవీ షోలతో పాటు సినిమాల్లోనూ నటిస్తూ తన కెరీర్‌ను బిజీగా గడిపేస్తోంది.

## 'చెన్నై లవ్ స్టోరీ'కి భారీ క్రేజ్ - హాట్ కేకుల్లా అమ్ముడైన ప్రీమియర్ టికెట్లు



యువతరం కథానాయకుడు కిరణ్ అబ్బవరం కొత్త చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. రేపు జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాకు ఒకరోజు ముందుగా ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్లకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని ప్రధాన కేంద్రాల్లో టికెట్లు పూర్తిగా అమ్ముడై, షోలు హౌస్‌ఫుల్ అయ్యాయి.ప్రేక్షకుల నుంచి వస్తున్న భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, పలు థియేటర్ల యాజమాన్యాలు అదనపు స్క్రీన్లను జోడిస్తున్నాయి. హైదరాబాద్‌లోని ప్రసాద్స్, ఏఎంబీ సినిమాస్, పీవీఆర్ వంటి ప్రముఖ మల్టీప్లెక్సులతో పాటు విజయవాడ, వైజాగ్, కాకినాడ, రాజమండ్రి వంటి నగరాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సోషల్ మీడియాలో చిత్ర బృందం ఈ విషయాన్ని ప్రకటిస్తూ, షోలు సోల్డ్ అవుట్ అయినట్లు వెల్లడించింది.గతంలో కొన్ని చిత్రాలకు ఫలించిన పెయిడ్ ప్రీమియర్ల వ్యూహం, 'చెన్నై లవ్ స్టోరీ' విషయంలోనూ భారీ విజయాన్ని అందుకుంది. ఈ అడ్వాన్స్ బుకింగ్స్ ట్రెండ్ చూస్తుంటే, రేపు విడుదల కానున్న ఈ చిత్రానికి ఘనమైన ఓపెనింగ్స్ ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తం మీద, విడుదలకు ముందే హౌస్‌ఫుల్ బోర్డులతో ఈ సినిమా ప్రేక్షకులలో భారీ అంచనాలను నెలకొల్పింది.ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాకు రవి నంబూరి దర్శకత్వం వహించారు. మాస్ మూవీ మేకర్స్, అమృత ప్రొడక్షన్స్ బ్యానర్లపై ఎస్.కె.ఎన్, సాయి రాజేష్ నిర్మించగా, ధీరజ్ మొగిలినేని సహ నిర్మాతగా వ్యవహరించారు. కథ, స్క్రీన్‌ప్లే బాధ్యతలను దర్శకుడు రవి నంబూరితో కలిసి నిర్మాత సాయి రాజేష్ పంచుకోవడం విశేషం.'బేబీ' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సాయి రాజేష్ అందిస్తున్న కథ కావడంతో 'చెన్నై లవ్ స్టోరీ'పై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగింది. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడికానున్నాయి. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఈ ప్రేమకథ ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.